## నేడు చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు

బోథ్, జూన్ 30 : బోథ్‌లోని రాఘవేంద్ర జిన్నింగ్ మిల్లు సమీపంలో సోమవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రజక సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రజక కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## భీమన్న దేవాలయంలో బోనాల పండుగ

భైంసా, జూన్ 30 : భైంసాలోని పురాణ బజార్‌లో ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్థుల ఆధ్వర్యంలో భీమన్న దేవుని పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ భీమన్న ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సునీల్, శేఖర్, రాందాస్, పోతన్న, లక్ష్మణ్, దశరథ్, శ్రీను, రాము, సాయిస్వామి, నరేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

## నేడు సోనాల తై బజార్ వేలం పాట

బోథ్, జూన్ 30 : సోనాల తై బజార్ వేలం పాట సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి స్వామి తెలిపారు. ఆసక్తి గల వారు రూ.30 వేలు డిపాజిట్ చెల్లించి, వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

## రేపు గుడిహత్నూర్‌లో..

గుడిహత్నూర్, జూన్ 30 : గుడిహత్నూర్‌లో ప్రతి శుక్రవారం జరిగే వారసంత తైబజార్ వేలం ఈ నెల 2వ తేదీన గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి తెలిపారు. వేలంలో గిరిజనులే పాల్గొనాలని, రూ.40వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, వార సంత వేలం పొందిన వారు 50 శాతం వెంటనే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

భైంసా, జూన్ 30 : గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భైంసాలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల్లో ఉన్నత విద్యాశాఖ ఆదేశానుసారం 2024-25 విద్యాసంవత్సరానికి అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, నెట్, సెట్, పీహెచ్ ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు మీడియంలో రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ సైన్స్, ఉర్దూ మీడియంలో ఉర్దూ, రాజనీతి శాస్త్రం, చరిత్ర, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయన శాస్త్రం పోస్టులు ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నాయని ఈ దరఖాస్తులను 4వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9908393217 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ముంబా మాతకు ప్రత్యేక పూజలు

భైంసా, జూన్ 30 : భైంసాలో ముంబా మాతకు అహీర్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. డప్పువాయిద్యాలతో భజన కీర్తనలతో ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. పంటలు బాగా పండి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మొక్కుకున్నారు.

## ధన్నూర్‌లో పస్కా రాజుల పండుగ

బోథ్, జూన్ 30 : మండలంలోని ధన్నూర్(బీ) గ్రామంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పస్కా రాజుల పండుగను ఘనంగా నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని వనదేవతలకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సదాశివ్, పట్టణాధ్యక్షుడు సంతోష్, శంకర్, రాజేశ్వర్, నారాయణ గణేశ్, స్వామి, రాంబత్తుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

## ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్నూరు కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు

కుంటాల, జూన్ 30 : కుంటాల మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు ఇటీవల ఉద్యోగోన్నతి పొందడంతో మున్నూరు కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం కుంటాల శాఖ తరపున ఆదివారం వారిని సన్మానించారు. తాటి సోమేశ్వర్ స్కూల్ అసిస్టెంట్‌గా, మానాజీగారి సిద్ధిరాం పీఎస్ హెచ్‌ఎంగా, సక్రపు గజేందర్, పీఎస్ హెచ్‌ఎంగా, ముజే రవి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాసరి రమేశ్, కొత్తకాపు నారాయణ, నర్సయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.

## రిటైర్డ్ కార్యదర్శికి..



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

తలమడుగు, జూన్ 30 : మండలంలోని ఝరి గ్రామానికి చెందిన బోర్ల భూమారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఆదివారం ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనన్నారు. భూమారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి..



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న బుద్ధవిహార్ కమిటీ సభ్యులు

భైంసా, జూన్ 30 : పట్టణంలో సదానంద్ అనే ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ పొందడంతో ఆదివారం పలువురు శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బుద్ధవిహార్ కమిటీ సభ్యులు, రాహుల్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

## మంద పోచమ్మ పండుగ

భైంసాటౌన్, జూన్ 30 : భైంసా మండలం దేగాం గ్రామంలో మంద పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి కురుమ సంఘం మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు బాబు, పోతన్న, లక్ష్మణ్, వీరన్న, లింగన్న పాల్గొన్నారు.

## నేడు మహాజన సభ సమావేశం

తాంసి, జూన్ 30 : మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఉదయం 10 గంటలకు రైతు భరోసాపై రైతుల సలహాలు, సూచనల కోసం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ప్రాథమిక సహకార సంఘం సీఈవో కేశవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రైతు భరోసా(రైతుబంధు) పథకాలపై రైతుల సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ సమావేశానికి ప్రత్యేకాధికారి డీసీవో మోహన్ హాజరవుతారని తెలిపారు. తాంసి, భీంపూర్ మండల రైతులు హాజరుకావాలని కోరారు.

# పంచాయతీ నిధులకు గ్రహణం..!

- ప్రత్యేక పాలనలో కార్యదర్శుల వేతలు
- గ్రామ పంచాయతీలకు నిధుల కొరత
- సంతకాలకే పరిమితమైన ప్రత్యేకాధికారులు
- అప్పుల ఊబిలో పంచాయతీ కార్యదర్శులు
- ప్రతి నెల జీపీలకు రావాల్సిన రాష్ట్ర, కేంద్రప్రభుత్వ నిధుల ఆలసత్వం



నార్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్రత్యేక పాలనలో గ్రామ పంచాయతీల నిధులకు గ్రహణం పట్టింది. గ్రామాలకు నిధులు లేక నిస్తేజంగా మారాయి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ముఖ్యంగా చిన్న గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉంది. చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. పంచాయతీ భవనాల, నల్లాల బావులు, బోరు మోటార్లకు కరెంట్ బిల్లులు కట్టడానికి కూడా నిధులు లేవని గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 16 నెలలుగా రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ), ఆరు నెలలుగా కేంద్రీయ (సీఎఫ్‌సీ) నిధులను సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో గ్రామ పంచాయతీల్లో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

నార్నూర్, జూన్ 30 : జనవరిలో పంచాయతీల పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులతో విధులను నిర్వహిస్తోంది. పంచాయతీ కార్యదర్శి రోజువారి పనులు ఓవైపు నిర్వహణ మరోవైపు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రత్యేకాధికారులు వారి వారి కార్యాలయాల్లోనే ఉంటూ సంతకాలకే పరిమితమవుతున్నారు. ప్రత్యేకాధికారులకు తమ రోజువారి బాధ్యతలతో పాటు ప్రభుత్వం పంచాయతీల నిర్వహణ బాధ్యతను అదనంగా అప్పగించడంతో వారు అటువైపు చూసేందుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో పంచాయతీ కార్యదర్శులపై అధిక భారం ఇవ్వడంతో అయోమయానికి గురవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు లేకపోవడం వల్ల పంచాయతీ నిర్వహణ భారం కార్యదర్శులపై పడడంతో వారు అప్పుల పాలవుతున్నారు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు కావాల్సిన నిధులు రాకపోవడం, ఇతర ఆదాయ వనరులు లేకపోవడంతో గ్రామాల్లో కనీస సమస్యలను కూడా పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

### పనులు ఆగకుండా ఉండేందుకు డబ్బులు సర్దుబాటు...

ప్రత్యేక పాలన కంటే ముందు గ్రామ పంచాయతీలకు సక్రమంగా నిధులు విడుదల చేయకపోయినా పాలకవర్గాలు ఉన్నప్పుడు సర్పంచ్‌లు ఏదో విధంగా డబ్బులు సర్దుబాటు చేసి పనులు ఆగకుండా చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో 2024 ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పనులు నిలిచిపోకుండా ఉండేందుకు డబ్బులు సర్దుబాటు చేసినప్పటికీ నెలల తరబడి పంచాయతీ లను ఎలా నిర్వహించాలన్న దానిపై వారు అయోమయానికి గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా ప్రత్యేకాధికారుల పాలనలో రాదు. మళ్లీ పంచాయతీల పాలకవర్గాలను ఎన్నుకున్న తర్వాతే కేంద్రం నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. గతంలో ఎస్ఎఫ్‌సీ నిధులు రాకున్నా, కేంద్రం ఇచ్చే నిధుల ద్వారా గ్రామాల్లో పాలకవర్గాలు గ్రామ పంచాయతీలను నెట్టుకు వచ్చాయి. ప్రస్తుతం ఇటు రాష్ట్ర, అటు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో ఆదాయ వనరుల్లేని గ్రామాల పరిస్థితి ఎటు తోచని దయనీయంగా స్థితిలోకి చేరుకుంటున్నాయి.

### నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం..



చాలా రోజుల నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు గ్రామ పంచాయతీలకు రావడం లేదు. 6 నెలల నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. చిన్నచిన్న పంచాయతీల్లో పంచాయతీ కార్మికుల జీతాలు కూడా చెల్లించలేకపోతున్నాం. గ్రామ పంచాయతీలలో ప్రాథమిక అవసరాలకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

-రమేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, గాదిగూడ మండలం

### సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తే ప్రయోజనం...



గ్రామాల్లో ప్రత్యేకాధికారులు గ్రామ పంచాయతీల వైపు కన్నెత్తి చూడడం లేదు. వారి కార్యాలయాలకే పరిమితమై భారం మొత్తం పంచాయతీ కార్యదర్శులపై వదిలేస్తున్నారు. దాని వల్ల పంచాయతీల నిర్వహణ భారం మొత్తం కార్యదర్శులపై పడుతోంది. ప్రత్యేక పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోంది. మాలాంటి చిన్న జీపీల పరిస్థితి మరి దయనీయంగా ఉంది. ప్రాథమిక అవసరాలకు కూడా తీర్చుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తే గ్రామాలకు ప్రయోజనం చేకూరుతోంది.

-ఉర్వేత రూప్‌దేవ్, మాజీ సర్పంచ్, గంగాపూర్


# వృత్తి నైపుణ్య శిక్షణతో ఆర్థికాభివృద్ధి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సాయివైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్

ఎదులాపురం, జూన్ 30 : వృత్తి నైపుణ్య శిక్షణతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందవచ్చని సాయివైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రాయిడరి, మగ్గంలో మూడు నెలల నుంచి శిక్షణ పొంది పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, యువతులు స్వయం ఉపాధితో ఆయా రంగాల్లో రాణించేలా భవిష్యత్‌లో మరిన్ని ఉచిత శిక్షణలు అందిస్తామన్నారు. మూడు నెలలకు ఒక సారి కొత్త బ్యాచ్ ప్రారంభిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ట్రస్ట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ చిక్కల రవికిరణ్, ట్రస్ట్ సభ్యులు ఆశన్నయాదవ్, శ్రీనివాస్, మహేందర్ యాదవ్, రామన్న, కావేటి రమేశ్ యాదవ్, స్వప్నిల్, ఓరుగంటి సత్యనారాయణ, శిక్షకురాలు అందుగుల శ్రావణి, రాథోడ్ పూజ, ఓరుగంటి వీణ, ప్రవళిక పాల్గొన్నారు.

# ఒక్క చోట చేరి.. జ్ఞాపకాలు గుర్తు చేసుకొని



ఉపాధ్యాయులతో 1996-97బ్యాచ్ విద్యార్థులు

కుంటాల, జూన్ 30 : కుంటాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97, 1999-2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల క్లాస్‌రూమ్‌లు, ఆవరణలో ఫొటోలు దిగి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు.

# అయ్యప్ప సేవా సమితి కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

నిర్మల్ అర్బన్, జూన్ 30 : నిర్మల్ పట్టణంలో అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జాప ప్రకాశ్, అధ్యక్షుడిగా బద్రి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సాదం ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా కనపర్తి విఘ్నేశ్, కోశాధికారిగా కుంటాల సాయినాథ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని పూలమాల, శాలువాలతో సన్మానించారు. రానున్న రోజుల్లో సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జనార్దన్, జిందం గోవర్ధన్, లక్ష్మీపతి, యువరాజ్, శ్రీను, శివప్రసాద్, నవీన్, శ్రీనివాస్, ప్రదీప్ పాల్గొన్నారు.

## గడ్డి విత్తనాలు పంపిణీ

తానూర్, జూన్ 30 : మండలంలోని బోసి గ్రామంలో ఆదివారం డెయిరీ రైతులకు సీఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధి ధోని యాదవ్ గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌డీ సంస్థ కోఆర్డినేటర్ కాస దత్తు, రైతులు పాల్గొన్నారు.

## అమ్మవారికి మకర తోరణం సమర్పణ

కుంటాల, జూన్ 30 : కుంటాల మండలంలోని గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. హైదరాబాద్‌కు చెందిన ఒడ్నం గజ్జారాం రూ. 13వేల విలువ గల మకర తోరణం ముత్యాలమ్మ అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా దాతను, వారి కుమారులు ఎన్‌ఆర్ఐ నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

## లైవ్ ఎంప్లాయీస్ బోథ్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా కైలాష్



రాథోడ్ కైలాష్

ఇచ్చోడ, జూన్ 30 : గిరిజన లంబాడాల ఐక్యవేదిక (లైవ్) ఎంప్లాయీస్ బోథ్ అసెంబ్లీ కో ఆర్డినేటర్‌గా రాథోడ్ కైలాష్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ తెలిపారు. రాథోడ్ కైలాష్ ఇచ్చోడ ప్రభుత్వ దవాఖానలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తనపై నమ్మకంతో నియమించడంపై సంతోషంగా ఉందని, బోథ్ నియోజకవర్గ పరిధిలో లంబాడాల ఐక్యత కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. లైవ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జాదవ్ రాజ్‌కుమార్, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎదులాపురం, జూన్ 30 : ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనను పోలీసులు ఛేదించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిర్మల్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు రాత్రి 8 గంటల ప్రాంతంలో బయలుదేరి వెళ్తుండగా ఆ వ్యక్తిపై నుంచి వెళ్లడంతోనే దుర్మరణం చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు బస్ డ్రైవర్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఏ అశోక్ తెలిపారు. కాగా మృతి చెందిన వ్యక్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. మృతి చెందిన వ్యక్తి ఒంటిపై వైలెట్ కలర్ షర్ట్, బ్లాక్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఆయన వయస్సు సుమారుగా 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు.

## రాథోడ్ రమేశ్ అంత్యక్రియలకు తరలిన జనం

ఇంద్రవెల్లి, జూన్ 30: భాజపా నేత, ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ శనివారం హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నలుమూలల నుంచి అభిమానులతో పాటు ప్రజలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. అంతేకాకుండా ఏజెన్సీలోని మండలాలకు చెందిన ఆయన అభిమానులతో పాటు పార్టీల నాయకులు, ప్రజలు భారీగా తరలివెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. నిర్వహించిన అంత్యక్రియల్లో ప్రజలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఇక్కడ నాయకులు, తదితరులు ఉన్నారు.

## దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

జైనథ్, జూన్ 30 : తరోడ(బీ) గ్రామంలోని మురళీకృష్ణ ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దొంగలు ఆదిలాబాద్‌కు చెందిన షేక్ సమీర్,షేక్ అయాన్‌గా గుర్తించారు. ఆలయంలో ఉన్న రూ.1050 దొంగలించే క్రమంలో గమనించిన స్థానికులు వారిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

## నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కు పరామర్శ



ఎంపీ ధర్మపురి అరవింద్‌ను పరామర్శిస్తున్న ఆదిలాబాద్ ఎంపీ నగేశ్

బోథ్, జూన్ 30 : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తండ్రి ధర్మపురి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం అరవింద్‌ను ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## ఆర్థిక పరిస్థితులతో ఒకరి ఆత్మహత్య

లోకేశ్వరం, జూన్ 30 : లోకేశ్వరం మండలం సేవాలాల్ తండాకు చెందిన పవార్ కృష్ణ(28) ఉరేసుకొని మృతి చెందినట్లు ఏఎస్ఐ దిగంబర్ తెలిపారు. వివరాల ప్రకారం...కృష్ణ గత కొంత కాలంగా ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేక అప్పులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయం చూసి దూలానికి ఉరివేసుకున్నాడు. భార్య పవార్ అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

# పది ఎకరాల రైతులకు రైతు భరోసా ఇవ్వాలి



తానూర్ : రైతు వేదికలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్

తానూర్, జూన్ 30 : తానూర్‌లోని రైతు వేదికలో ఆదివారం హంగిర్గా సొసైటీ చైర్మన్ నారాయణ్‌రావుపటేల్ అధ్యక్షతన రైతు భరోసాపై రైతుల అభిప్రాయాల సేకరణ సమావేశం నిర్వహించారు. 10 ఎకరాలు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా అందించాలని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, హంగిర్గా సొసైటీ వైస్‌చైర్మన్ పసుల నాగ్‌నాథ్, డైరెక్టర్లు పుండ్లిక్, గజానంద్, అమోల్, మాజీ సర్పంచ్‌లు మాధవ్‌రావుపటేల్, సొసైటీ సీఈవో భూమయ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

భైంసా, జూన్ 30 : భైంసాలోని కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతు భరోసాపై సమావేశం నిర్వహించారు. రైతుభరోసా ప్రస్తుతం 10 ఎకరాలు ఉన్న రైతులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంకు సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చాకలి లస్మన్న, డైరెక్టర్ కారిగిరి సాయినాథ్, చంద్రకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది రాజేందర్ పాల్గొన్నారు.

### రైతుల కోసమే మహాజనసభ

ముథోల్, జూన్ 30 : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు(రైతుభరోసా) పథకంలో మార్పులపై రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ తీగల వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ముథోల్‌లోని పీఏసీఎస్ కార్యాలయంలో ప్రత్యేక మహాజన సభను నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయధికారి అంజిప్రసాద్, మండల వ్యవసాయాధికారి అజ్మీర్ భాస్కర్ హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రైతు భరోసా పథకం ఎన్ని ఎకరాలకు వర్తింపజేసే దానిపైన రైతుల పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో నగేశ్‌బాబా, సాయిరెడ్డి పాల్గొన్నారు.

### రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి

కుభీర్, జూన్ 30 : రైతులు సాగు చేసే ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలని పలువురు రైతులు పేర్కొన్నారు. కుభీర్‌లోని ప్రాథమిక సహకార సంఘంలో చైర్మన్ రేకుల గంగాచరణ్ అధ్యక్షతన ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. రైతు భరోసాపై రైతులు తెలిపిన అభిప్రాయాలను జిల్లా కార్యాలయానికి నివేదిక పంపిస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో డీసీఏవో నర్సయ్య, జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ జగదీశ్, సీఈవో ఎగ్గం క్రాంతికుమార్, రైతులు పాల్గొన్నారు.



కుభీర్ : మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రేకుల గంగాచరణ్



ముథోల్ : మాట్లాడుతున్న అధికారులు

# రైతుల ఐడియా అదిరే...

దిలావర్‌పూర్ మండలం న్యూలోలం గ్రామానికి చెందిన రైతుకు అడవి పరిసర ప్రాంతానికి దగ్గరలో పంట పొలం ఉండడంతో వరినారు చల్లి పిట్టల నుంచి రక్షించుకునేందుకు గాను ఏమి చేయాలో అర్థం కాకా ఓ ఐడియాను ఆలోచించి వరి విత్తనాలు చల్లి దానిపై పాత చీరలను ఆరబెట్టినట్లు కప్పి ఉంచాడు. చుట్టు ఇతర జంతువులు రాకుండా రక్షణ చర్యలు చేపట్టినారు. ఈ పద్ధతిలో రైతు చల్లిన వరినారు పక్షులకు దొరకకుండా జాగ్రత్తగా నారు పైకి వస్తుంది. మరో రైతు మొలకెత్తిన వరి నారులో అటవీ జంతువులు రాకుండా చుట్టు చేపల వలను ఏర్పాటు చేసి రక్షించుకుంటున్నాడు..

-దిలావర్‌పూర్, జూన్ 30



దిలావర్‌పూర్‌లో వరి నారు రక్షణకు చేపల వలను చుట్టిన రైతు



న్యూలోలంలో వరి నారు విత్తనాలు పక్షులు తీనకుండా పాత చీరలను ఆరబెట్టిన రైతు